సాక్షి
తిరుపతి
మంగళవారం । 26 । నవంబర్ । 2024



సంతోషంలో అర్జీదారులు

తిరుపతి కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఎట్టకేలకు సమస్యలు తొలిగాయి. అర్జీదారులకు కావాల్సిన వసతులు సమకూరాయి. - 8లో



30న స్వర్ణముఖి నదీ హారతి

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఈనెల 30న స్వర్ణముఖి నదీ హారతి చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.



సరిహద్దు గ్రామాలు గజగజ

చిన్నగొట్టిగల్లు మండలంలోని సరిహద్దు గ్రామాలు గజరాజులతో గజగజలాడుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

బాల్యవివాహాలు ఆందోళనకరం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

తిరుపతి రూరల్: జిల్లాలో బాల్య వివాహాలు పెరగడం ఆందోళనకరంగా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేఖంగా జాతీయ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం జిల్లా మహిళా సమఖ్య ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు వివిధ స్థాయిల్లో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27 శాతానికి పైగా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. దీని వల్ల 26 శాతానికి పైగా టీనేజ్ ప్రెగ్నన్సీ కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే పులివర్తినాని, రూరల్ ఎంపీపీ వేముల యశోద, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఎంపీడీఓ రామచంద్ర, డీఎస్పీ శ్రీలత, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి పాల్గొన్నారు.

అడిషనల్ ఈఓ తనిఖీలు



హెచ్‌టీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేస్తున్న అదనపు ఈఓ

తిరుమల: తిరుమలలోని హెచ్‌టీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద టీటీడీ అడిషనల్ ఈఓ సిహెచ్.వెంకయ్యచౌదరి సోమవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అనంతరం రామ్ భగిచా బస్టాండ్ వద్ద ఉన్న అన్నప్రసాద పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 74 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు సోమవారం 74 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు వెల్లడించారు. వెంటనే సంబంధిత ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,737 మంది స్వామివారిని దర్శించుకోగా 23,208 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కాలనాగు ఒక్కసారే కాటేస్తుంది.. ఈ కరెన్సీ నాగులు మాత్రం అనుక్షణం కాటేస్తూనే ఉంటాయి.. నోట్ల కట్టల మత్తెక్కిపోయి.. మానవత్వం మరిచి..పేదల నడ్డివిరిచేలా వడ్డీలు గుంజి.. చెల్లించకుంటే దాడులు చేసి, ఇంట్లో సామగ్రి, భూములు లాక్కొంటున్నాయి. ఫలితంగా సామాన్య పేద రైతు కుటుంబాలు ఊరొదిలి వెళ్లేలా చేస్తున్నాయి. ఇంత జరిగినా తమకేమీ పట్టనట్టు అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తోంది. ఇదీ వడ్డీవ్యాపారుల కబంధహస్తాల్లో చిక్కి విలవిలలాడుతున్న ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు దీనగాథ.



ఊరునాయునిపల్లి గ్రామం

పల్లెల్లో పైసాచికం

సీఎం ఇలాకాలో విలవిల్లాడుతున్న పేద రైతులు

- రూ.5 నుంచి రూ.15 వడ్డీ
- ఏ ఇబ్బంది వచ్చినా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిందే
- 15 రోజులకోసారి వసూలు
- గంట ఆలస్యమైనా తప్పని దాడులు
- సగానికి పైగా భూములు వ్యాపారుల పరం
- భరించలేక ఊళ్లు వదిలివెళుతున్న బాధితులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- ఇదీ ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు దుస్థితి

కుప్పం రూరల్: సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజక వర్గంలోని ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు గ్రామాలు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కి బిక్కుబిక్కుమంటున్నాయి. మూఢ నమ్మకాల గ్రామాలుగా పేరొందిన ఈ గ్రామాలు ఇప్పుడిప్పుడే ఆ నమ్మకాల నుంచి బయటపడుతున్నాయి. ఇంతలోనే మరో మహమ్మారి రెండు గ్రామాలను ఛిద్రం చేస్తోంది. అదే వడ్డీ వ్యాపారులనే మహమ్మారి. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు వీరంతా. వారి అవసరాలు ఆధారంగా రూ.5 నుంచి రూ.15 వరకు వడ్డీ వసూలు చేస్తూ పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారు. ష్యూరిటీల పేరిట ఇప్పటికే సగానికి పైగా గ్రామంలోని భూములను వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకున్నారంటే వడ్డీ వ్యాపారుల దందా ఏ మేరకు సాగుతుందో అర్థమవుతుంది.

పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ఈ రెండు గ్రామాలు వడ్డీ వ్యాపారుల వలలో చిక్కుకుని ఊపిరాడక కొట్టుమిట్లాడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. జనం వడ్డీలు కట్టలేక వలస వెళుతున్నా ఎవరికీ పట్టడం లేదు. గ్రామాల్లో తరచూ వడ్డీ వ్యాపారుల దాడులు జరుగుతున్నా, సమాచారం లేదనే నెపంతో వీరిని పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో గ్రామసభలు పెట్టి అవగాహన కల్పించాలనే కనీస ఆలోచన ప్రభుత్వ యంత్రాంగంలో లేకపోయింది. దీంతో నిత్యం ఓ కుటుంబం వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. బ్యాంకర్లు అయినా ఈ రెండు గ్రామాల జనానికి విరివిగా రుణాలు ఇచ్చి ఆదుకోవాల్సి ఉంది. లేదంటే వీరి పరిస్థితి అథోగతే.



వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి సగానికి పైగా భూములు

ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు గ్రామాలవాసులు వడ్డీ చెల్లించలేని స్థితిలో తమ భూములను సైతం వడ్డీ వ్యాపారుల పాలు చేశారు. పేదలు వారికి డబ్బు ఇస్తే తిరిగి చెల్లించలేరని, ఎలాగైనా వారి భూములు కొట్టేయాలని ముందుచూపుతో వడ్డీ వ్యాపారులు అప్పు ఇచ్చే సమయంలోనే వారి భూములను వ్యాపారుల పేరున రాయించుకుంటున్నారు. ఒక నెలా రెండు నెలలు వడ్డీ చెల్లించకపోతే భూములు వదులు కోవాల్సిన పరిస్థితి దాపరించింది. చాలా మంది వడ్డీ కట్టలేక, తీసుకున్న డబ్బులు చెల్లించలేక భూములను వడ్డీ వ్యాపారులకు వదిలిపెట్టి గుట్టుచప్పుడు కాకుండా కుటుంబాలకు కుటుంబాలుగా ఊరు వదిలి వెళుతున్నారు. ఇప్పటికే కుప్పం సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఈ రెండు గ్రామాలకు చెందిన భూములు పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారుల పేర్లపై మారుతున్నాయి. ఊరునాయునిపల్లి గ్రామంలో కొంతవరకు పరిస్థితి ఒక రకంగా ఉన్నా, ఊరునాయునికొత్తూరు గ్రామంలో మాత్రం ఉన్న 80 కుటుంబాల్లో 20 కుటుంబాలు ఊరు వదిలి వెళ్లాయంటే వడ్డీ వ్యాపారులు ఒత్తిడి ఏమేరకు ఉందన్న విషయం అర్థమవుతుంది. మరో నాలుగు సంవత్సరాలు పరిస్థితి ఇలాగే కొనసాగితే ఊరు మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి దాపురిస్తుంది.



జనం లేక బోసిపోయిన ఊరునాయునికొత్తూరు గ్రామం



వడ్డీలు కట్టలేక వలస వెళ్లడంతో మూతపడిన ఇల్లు

స్థానికులకు తోడు తమిళ తంబీలు

నిత్యం ఈ రెండు గ్రామాలపై పదుల సంఖ్యలో వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ కంపెనీలు దాడులు చేస్తున్నాయి. స్థానికంగా ఉన్నా వ్యాపారులే కాకుండా తమిళనాడు రాష్ట్రం మహరాజగాడైకు చెందిన వ్యక్తులు సైతం ఈ గ్రామాల్లో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. ఈ తమిళ తంబీలు అయితే వడ్డీ కట్టలేమని బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు వెళ్లినా అక్కడికి వెళ్లి వారిపై దాడులకు దిగుతున్నారు. తమిళులు అయితే ముందుగానే వడ్డీలు పట్టుకుని 15 రోజులకోసారి వడ్డీ చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పేదలు ముక్కు పుడకలు, ధాన్యాలు, పాత్రలు అమ్మి అప్పులు కడుతున్నారు. యువకులు అయితే సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు అమ్ముకుని వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ వడ్డీ వ్యాపారం చేసే వారికి ఏ ఒక్కరికీ లైసెన్సులుగానీ, ప్రభుత్వ అనుమతులు గానీ లేకపోయినా రూ.లక్షల్లో వడ్డీలకు ఇచ్చి జనాన్ని దోచుకుంటున్నారు.

వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో..

కుప్పం మండలంలోని గుడ్లనాయనపల్లి పంచాయతీలో ఊరునాయునిపల్లి, ఊరునాయునికొత్తూరు అటవీ గ్రామాలున్నాయి. ఊరునాయునిపల్లిలో 140 గృహాలకు గాను 845 మంది, ఊరునాయునికొత్తూరులో 80 కుటుంబాలకు 450 మంది జీవనం సాగిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ రెండు గ్రామాల్లో మూఢనమ్మకాలు రాజ్యమేలేవి. మహిళలు బహిష్టులు అయితే గ్రామానికి దూరంగా ఉండడం, గ్రామాల్లో చెప్పులు లేకుండా తిరగడం తదితర ఆనవాయితీలు ఈ పల్లెల్లో ఉండేవి. ప్రభుత్వాలు, కొంత మంది సామాజికవేత్తల కృషితో ఇప్పుడిప్పుడే నాగరిక ప్రపంచంలోకి అడుగులు వేస్తోంది. ఇంతలోనే వీరిని వడ్డీ వ్యాపారులనే మహమ్మారి చిదిమేస్తోంది. ఈ రెండు గ్రామాల్లో మొత్తం 220 కుటుంబాలు దాదాపుగా కూలీ పనుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఏ అవసరం వచ్చినా డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులనే ఆశ్రయించాల్సి ఉంది. వేరే ఆదరవు లేదు. కూతురుకు పెళ్లి చేయాలన్నా, ఏదైనా పంటలకు పెట్టుబడి కావాలన్నా.. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా వడ్డీ వ్యాపారులే దిక్కు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీ వ్యాపారులు రూ.5 నుంచి రూ.15 వరకు వసూలు చేస్తూ వారిని అప్పుల పాలు చేస్తున్నారు. కొంత మంది అయితే ఈ వడ్డీని సైతం 15 రోజులకోసారి వసూలు చేస్తూ జనం రక్తాన్ని పీలుస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం గంట ఆలస్యమైనా వడ్డీ వ్యాపారులు వారి మనుషులతో వచ్చి దాడులకు దిగుతున్నారు. చేసేది లేక ఇళ్లు లేనివారు వంట పాత్రలు, బిందెలు తెచ్చి వారికిచ్చి మరీ వడ్డీలు చెల్లిస్తున్నారు.

కొడుకుల వలసతో ఒంటరినయ్యాను



నాకు ముగ్గురు కొడుకులు. ఇద్దరు జీవనోపాధికి బెంగళూరుకు వలస వెళ్లారు. ఉన్న ఒక కొడుకు వడ్డీ వ్యాపారుల బారీన పడి ఉన్న భూమిని అమ్ముకుని వలస వెళ్లిపోయాడు. నేను ఒంటరిని అయ్యాను. భూమి పోయింది. కొడుకు వెళ్లిపోయాడు. ఈ వయసులో నేనేం చేయాలి (కన్నీళ్లు పెట్టుకుంటూ). ఎవరైనా దేవుడు మా వాళ్లకు మంచి చేస్తే బాగుండు.

– మలప్ప, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

నేనూ బాధితుడినే..



నేను కూడా వడ్డీ వ్యాపారుల బాధితుడినే. అవసరం ఆధారంగా రూ.15 వడ్డీ వసూలు చేస్తున్నారు. గంట ఆలస్యమైనా బూతులు తిట్టడం, దౌర్జన్యాలు చేస్తున్నారు. గ్రామంలో చులకనగా మాట్లాడడం, పని దగ్గరకు వచ్చి యజమానికి చాడీలు చెబుతున్నారు. ఏమి చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం అయినా ఆదుకుని, వడ్డీ వ్యాపారుల భారీ నుంచి కాపాడాలి.

– రంజిత్, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

అవసరాన్ని ఆసరాగా చేసుకుని..



మా ఊళ్లో అందరు పేదలే. కూలి పనులు చేసుకుంటే గానీ కుటుంబాలు గడవవు. ఏ అవసరం వచ్చినా వడ్డీ వ్యాపారులే గుర్తుకు వస్తారు. అవసరానికి ఎక్కువ వడ్డీ అయినా తీసుకుంటున్నారు. వీరి ఆసరాన్ని ఆసరాగా చేసుకుని, వడ్డీ వ్యాపారులు నెలా, పదిహేను రోజులకొకసారి రూ.5 నుంచి రూ.15కు పైగా వడ్డీ వసూలు చేస్తున్నారు. ఆలస్యమైతే దాడులకు దిగుతున్నారు. చేసేది లేక ఇంటి సామగ్రి, ఉన్న అరకొర ధాన్యాలు అమ్ముకోవాల్సి వస్తోంది.

– గోవిందు, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

ముక్కంటి దర్శనానికి 3 గంటలు

శ్రీకాళహస్తి: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ముక్కంటి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివయ్య సన్నిధి చెంత నిద్రించేందుకు ఆదివారం సాయంత్రమే పెద్ద ఎత్తున తరలివచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఆలయం కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి దాదాపు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. ఆలయ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. దళారులను కట్టడి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. సుమారు 40 వేలమందికి పైగా భక్తులు రాగా.. ఐదు రకాల రాహు–కేతు సర్పదోష పూజలు 4,169 జరిగాయి. 257 మంది అభిషేకం పూజల్లో పాల్గొన్నారు. రూ.200 కూలైన్ కంచుగడప వద్ద సర్వదర్శనంతో కలిపేయడంతో భక్తులు గందరగోళానికి గురయ్యారు.



ఆలయం వద్ద భక్తుల రద్దీ

వెనుదిరిగిన దోనర్లు

దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విరాళాలు ఇవ్వడానికి విరాళాల కేంద్రానికి వచ్చారు. అయితే అక్కడ యూపీఐ స్కానర్లు లేకపోవడంతో వెనుదిరిగారు. అధికారులు దేశం మొత్తం యూపీఐ స్కానర్లు పెడుతుంటే శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

దూసుకొచ్చిన ట్రాక్టర్

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం కావడంతో సుపథ మండపం వద్ద భక్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఓ ట్రాక్టరు పెంకులు నింపుకుని భక్తుల మధ్యలోకి దూసుకు వచ్చింది. పక్కకు జరగాలని పెద్దగా అరుస్తూ కన్నప్ప తిప్ప వైపు వెళ్లింది. రద్దీ ఉన్న సమయంలో కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తూ అధికారులు అనుమతించడం సరి కాదని భక్తులు ధ్వజమెత్తారు.



భక్తుల మధ్యలోకి దూసుకొచ్చిన ట్రాక్టర్

అదనపు గంట..
అందరికీ మంట!

పాఠశాలల్లో అదనపు పనివేళలు

- జిల్లా వ్యాప్తంగా 34 పాఠశాలల్లో అమలు
- మండిపడుతున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆందోళనలను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. పాఠశాలల్లో అదనపు పనివేళలకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 34 పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలు పెంచి అమలు చేస్తోంది. దీనిపై పలువురు మండిపడుతున్నారు.

పెరిగిన పనివేళలు

ప్రస్తుతం పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. అయితే కొత్త టైమ్ టేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపికైన పాఠశాలలు పనిచేయాల్సిఉంది. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్ సమయం 5 నిమిషాలు చొప్పున, భోజన విరామ సమయాన్ని 15 నిమిషాలు ఉంటుంది. ఉదయం మొదటి పీరియడ్‌ను 50 నిమిషాలకు పెంచారు. ఆ తరువాత 3 పీరియడ్లను 40 నుంచి 45 నిమిషాలు చేశారు. మధ్యాహ్నం మొదటి పీరియడ్ సమయాన్ని మార్చకుండా తక్కిన 3 పీరియడ్లను 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పుతో పాఠశాల సమయం గంట పెరగనుంది. ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కొత్త టైంటేబుల్ ఇలా..

ఫస్ట్ బెల్ ఉదయం 9 గంటలకు, సెకండ్ బెల్ 9.05, స్కూల్ అసెంబ్లీ 9.05 నుంచి 9.25, మొదటి పీరియడ్ 9.25 నుంచి 10.15, రెండో పీరియడ్ 10.15 నుంచి 11.00, బ్రేక్ 11.00 నుంచి 11.15, మూడో పీరియడ్ 11.15 నుంచి 12, నాల్గో పీరియడ్ 12 .00 నుంచి 12.45, లంచ్ బ్రేక్ 12.45 నుంచి 1.45, ఐదో పీరియడ్ 1.45 నుంచి 2.30, ఆరో పీరియడ్ 2.30 నుంచి 3.15, బ్రేక్ 3.15 నుంచి 3.30, ఏడో పీరియడ్ సాయంత్రం 3.30 నుంచి 4.15, ఎనిమిదో పీరియడ్ 4.15 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

అసంబద్ధ నిర్ణయం



పాఠశాలల పనివేళల్లో మార్పు పూర్తిగా అసంబద్ధం, అశాస్త్రీయం. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తు న్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు 4, 5 కి.మీ దూరం నుంచి పాఠశాలలకు రావాల్సి ఉంటుంది. విద్యార్థినుల పరిస్థితి అయోమయం. పనివేళల పెంపును ఉపసంహరించుకోవాలి.

– దొడ్డ ఉమామహేశ్వర్, జిల్లా చైర్మన్, ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫోర్టో)

వ్యతిరేకిస్తున్నాం



పాఠశాలల పనివేళలను మార్పు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులకు మానసిక ఒత్తిడి పెరుగుతుంది. విద్యాప్రమాణాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మరింత సమస్యను తెచ్చిపెడుతుంది. వీటన్నింటినీ పరిశీలించాలి.

– ఎస్.బాలాజీ, రాష్ట్ర అధ్యక్షులు, ఆపస్

క్రీడా నిధులు చెప్పండి?

- పార్లమెంట్‌లో గళమెత్తిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



గురుమూర్తి, తిరుపతి ఎంపీ

తిరుపతి మంగళం: గ్రామీణ క్రీడా కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు తిరుపతి పార్లమెంటు పరిధిలో గత మూడేళ్లలో 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా కేటాయించిన నిధుల వివరాలు తెలపాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన పలు ప్రశ్నలు సంధించారు. కేంద్ర యువజన, క్రీడా శాఖా మంత్రి మన్సుక్ మాండవీయ స్పందిస్తూ దేశవ్యాప్తంగా క్రీడలలో నైపుణ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. నిధుల విషయానికి వస్తే 2021–22, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా రూ.869, రూ.600, రూ.880 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

పాఠశాలల దుస్థితి పట్టదా?

సైదాపురం: తిరుపతి పార్లమెంట్ పరిధిలోని వెంకటగిరి నియోజకవర్గం, సైదాపురం మండలం, కలిచేడు, తలుపూరు గ్రామాలలో మైకా మైన్స్ లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఎం.ఎం.ఎల్.డబ్ల్యూ.ఓ) పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని కేంద్ర కార్మిక శాఖా మంత్రి మన్సుక్ మాండవీయకు ఎంపీ వివరించారు. పాఠశాల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలన్నారు. ఆ లోపు తరగతుల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



తడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. సూళ్లూరుపేట జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ తెలిపిన సమాచారం మేరకు.. తడకండ్రిగ పంచాయతీలోని అనపగుంట గ్రామం వద్ద కేజీబీవీ పాఠశాల వెనుక పట్టాలు దాటుతున్న సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేట వైపు వచ్చే దిగువ మార్గంలో రైలు ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని 60 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు పసుపు రంగు చొక్కా, కాఫీ కలర్ డిజైన్ లుంగీ ధరించినట్టు వెల్లడించారు. ఇతని కుడి చేతిపై పచ్చబొట్టు ఉన్నప్పటికీ అది సరిగా కనిపించడం లేదన్నారు. ఇతనికి సంబంధించి మరెలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఉదయం 10.50 సమయంలో మధురై నుంచి చండీగఢ్ వెళ్లే రైలు ఢీకొన్నట్టు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సూళ్లూరుపేట జీఆర్పీలో సంప్రదించాలని కోరారు. ఫోన్ నంబరు 94409 04877, 95732 45266 నంబర్లకు కూడా సంప్రదించొచ్చని ఆయన సూచించారు.

ఎర్రచందనం స్వాధీనం

• స్మగ్లర్ అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా రాజంపేట సెక్షన్‌లోని పించా డ్యామ్ వద్ద ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఓ స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్, డీఎస్పీ జీ.బాలిరెడ్డి ఆదేశాల మేరకు రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ టీ.రాఘవేంద్ర టీమ్ రాజంపేట సెక్షన్‌లోని పించా డ్యాం వైపు కూంబింగ్ చేపట్టారన్నారు. ఆరోగ్యపురం సమీపంలోని చేయ్యేరు వద్ద కొందరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేసినట్టు తెలిపారు. వారు పారిపోతుండగా అందులో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. అతను అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. అక్కడి సమీపంలో దాచి ఉంచిన ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించగా ఎస్ఐ సీహెచ్.రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

బతుకు చిత్రం!

కనుమరుగవుతున్న ప్రాచీన కళకు జీవం పోస్తున్నారు. వివిధ చిత్రాలను వినూత్నంగా తీర్చిదిద్దుతూ ఆకట్టుకుంటున్నారు. సంపాదనలోనూ పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. కుటుంబానికి తమవంతు సహకారం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. సత్యవేడులోని కలంకారీ మహిళలు. సుమారు 40 కుటుంబాల మహిళలు కలంకారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కష్టకాలంలోనూ ఇదే వృత్తిని నమ్ముకుని బతుకు బండిని సాగిస్తున్నారు. వీరి జీవన విధానం.. కలంకారీ శైలిని ఓ సారి పరిశీలిద్దాం..!





రంగులు పూర్తి చేసిన వస్త్రం చూపుతున్న కళాకారులు



వస్త్రంపై రంగులు అద్దుతున్న మహిళలు



వస్త్రంపై డిజైన్ గీస్తున్న రేఖ

సత్యవేడు: కలంకారీ సంస్కృతి శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటిది. జానపద, పౌరాణిక ఘట్టాలను వేళ్లతోనే చీరపై వేసే రంగుల కళ ఇది. కలంకారీ కుటీర పరిశ్రమ తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో పురుడు పోసుకున్నా.. సత్యవేడులోనూ ఇది దినదినాభివృద్ధి చెందుతోంది. మండల కేంద్రమైన సత్యవేడు పంచాయతీ పరిధిలో 40 కుటుంబాల మహిళలు ప్రస్తుతం కలంకారీ వృత్తిలో రాణిస్తున్నారు. కలంకారీ పదంలో కలం అంటే 'పెన్ను', కారీ అంటే 'రాసే వ్యక్తి'. మహిళలు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా డిజైన్లలో మార్పులు చేస్తూ వినియోగదారులు, వ్యాపారుల మన్ననలు పొందుతున్నారు. శ్రమతో కూడిన కలంకారీ వృత్తిని ఎంచుకొని నెలకు రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు సంపాదిస్తూ కుటుంబాలకు ఆర్థిక చేయూతనందిస్తున్నారు. గతంలో చీరలపైనే బొమ్మలు గీసేవారు. ఇప్పుడు దోవతి, కుర్తా దుప్పటాపైనా అద్భుత చిత్రాలు గీస్తూ.. వాటికి జీవం పోస్తున్నారు.

ఆమే ఆదర్శం

శ్రీకాళహస్తికి చెందిన రేఖ సత్యవేడు మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీకి చెందిన జీ.మురళిని వివాహం చేసుకొని సత్యవేడుకు వచ్చారు. అమ్మవారింట నేర్చుకున్న కలంకారీ వృత్తిని తోటి మహిళలకు నేర్పిస్తూ నేడు 40 మంది కుటుంబాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. చిత్రాకు జీవంపోస్తూ పలువురికి జీవనం కల్పిస్తున్నారు.

'దివి పెన్ కలంకారీ'

'దివి పెన్ కలంకారీ' పేరుతో కళంకారీ చిత్రాలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నారు. సత్యవేడులో పాత స్టేట్ బ్యాంక్‌పైన అద్దె గదిలో వస్త్రాలకు రంగులు అద్దుతూ కలంకారీ వ్యాపారంలో రాణిస్తున్నారు.

వెడ్డింగ్ కాన్సెప్ట్‌తో ఫొటోలు

మార్కెట్ విస్తరించడంతో వివాహ వేడుక మధుర జ్ఞాపకాల కోసం ధనవంతులు పెండ్లి కాన్సెప్ట్‌తో ఫొటోలు ఆర్డర్లు ఇస్తున్నారు. వారి వివాహానికి కావాల్సిన వధూవరుల చిత్రాలు, నిశ్చయతాంబూలం, కల్యాణ తిలకం, కాశీయాత్ర, అంకురార్పణం, గౌరీపూజ, జీలకర్రబెల్లం, వివాహంలో మాంగల్యధారణ, తలంబ్రాలు, సప్తపది స్థాలీపాకం, అప్పగింతలు చిత్రాలు(బొమ్మలు) నాణ్యమైన రంగులతో అద్ది ఇస్తున్నారు. వారు పెండ్లి ఫొటోల బొమ్మలను ఆల్ బొమ్మలుగా ముద్రించుకుంటున్నారు.

వివిధ పట్టణాల్లో షోరూంలు నుంచి ఆన్‌లైన్‌లో వస్తున్న ఆర్డర్లుకు తగిన విధంగా తయారు చేసి పంపిస్తున్నారు. అలాగే ముంబయి, హైదరాబాద్, సూరత్, హర్యానా, కోల్‌కత్తా, కేరళ, పూణే, అస్సాం, కాంచీపురం చీరలు(కంచి), ధర్మవరం, నారాయణవనం, చెన్నై నుంచి ఆన్‌లైన్ ఆర్డర్లు వస్తున్నట్టు కలంకారీ కళాకారులు చెబుతున్నారు.

అద్దకం పనులు నేర్పించింది



నేను 9వ తరగతి వరకు చదువుకున్నా. శ్రీసిటీ కంపెనీలో పనికోసం వెళితే వినికిడి లోపం ఉందని పని ఇవ్వలేదు. అయినా నిరాశ చెందలేదు. నాకు రేఖ అక్క రంగులు అద్దడం నేర్పించింది. ఇప్పుడు కలంకారీ కళాకారిణిగా రంగులు అద్దుతున్నా. నెలకు రూ.6 వేల నుంచి రూ.12 వేలు వరకు సంపాదిస్తున్నా.

వీ.సత్య, సత్యవేడు

ఇక్కడే పనిచేస్తున్నా



నేను సత్యవేడు పంచాయతీలోని కుమ్మరిగుంటలో నివాసముంటున్నా. ఇంటర్ వరకు చదివాను. నాకు ఇద్దరు పిల్లలు. వారి ఆలనా పాలన దగ్గరుండి నేనే చూడాలి. దూర ప్రాంతాలకు పనికి వెళ్లడం వీలు కాదు. సత్యవేడులోనే ఉంటూ దివి పెన్ కేంద్రంలో పని చేస్తున్నా.

జీ.మాధవి, కుమ్మరిగుంట, సత్యవేడు

మనవడి చదువుకు సాయం



నాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె, కొడుక్కి పెండ్లి చేశాను. ప్రస్తుతం కుమారుడి వద్ద ఉంటున్నా. నా కొడుకు ఇంటి ఖర్చులు భరిస్తూ వాడి ఇద్దరు పిల్లల్ని కాన్వెంట్లో చదివిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. నేను పనికి వెళ్లి వచ్చే డబ్బులతో మనువడు, మనుమరాలు చదువుకు ఫీజులు చెల్లిస్తున్నాను.

ఎం.రాజేశ్వరి, పల్లాపువీధి సత్యవేడు

కుటుంబ నిర్వహణకు తోడుగా..



నా భర్త సంపాదన నెలలో వంట ఖర్చులకు, పిల్లల చదువులకు చాలడంలేదు. కలంకారీ పని నేర్చుకొని వచ్చే డబ్బులో కాపురం నెట్టుకొస్తున్నాను. ఇప్పుడు ఇంట్లో ఇద్దరం పని చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు కొంతవరకు తగ్గాయి. కుటీర పరిశ్రమ నాకు ఆధారంగా నిలిచింది.

ఎం.చంద్రిక, అత్తికాయల వీధి, సత్యవేడు

పదిమందికీ కూడు పెడుతోంది



నాకు ప్రభుత్వ కలంకారీ ఆర్టిస్టు కార్డు ఉంది. మిని స్టరీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు ఉంది. నేను పలువురికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారు ప్రస్తుతం నాకు సాయంగా పనిలో ఉంటున్నారు. వ్యాపారంలో వచ్చే ఆదాయంలో నాతోటి కార్మికులకు వేతనం ఇస్తున్నాను.

– జీ.రేఖ, కొత్తమారికుప్పం, సత్యవేడు

తప్పిన సమస్యలు.. సంతోషంలో అర్జీదారులు

• గ్రీవెన్స్‌కు 222 అర్జీలు

తిరుపతి అర్బన్: హమ్మయ్యా.. ఎట్టకేలకు గ్రీవెన్స్‌లో వసతులు కల్పించారు. 'సాక్షి' వరుస కథనాలతో అధికారులు స్పందించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను పరిష్కరించారు. సోమవారం అందరికీ సరిపడా కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే తాగునీటి వసతి కల్పించారు. అధికారులు అర్జీదారులతో గౌరవంగా మాట్లాడే పద్ధతిని అలవాటు చేసుకున్నారు. దీనిపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌కు మొత్తం 222 అర్జీలు రాగా.. అందులో 135 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. జేసీ శుభం బన్సల్‌తోపాటు డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.



అర్జీదారుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

పింఛన్ ఇప్పించండయ్యా!



మాది తిరుపతి రూరల్ మండలం. నాకు కొంత కాలంగా కాళ్లుచేతులు పనిచేయడం లేదు. మా ఇంటికి నేనే ఆధారం. ప్రస్తుతం నా పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. నా వైద్య ఖర్చుల కోసం పింఛన్ ఇప్పించండయ్యా..!. తొమ్మిది వారాలుగా కలెక్టరేట్‌కు తిరుగుతున్నా.. అయినా ఫలితం లేదు.

–కే.షణ్ముగం, తిరుచానూరు

స్వామియే శరణం అయ్యప్ప!

తిరుపతి రూరల్: తుడా మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తొలిసారిగా అయ్యప్పమాల ధారణ చేశారు. సోమవారం సాయంత్రం తుమ్మలగుంటలోని ఆయన ఇంటి వద్ద పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే మంత్రంతో పూజను ప్రారంభించిన అయ్యప్ప స్వాములు మొదటగా గణపతిని ఆరాధించారు. ఆ తర్వాత సుబ్రమణ్య స్వామిని, పరమశివుడు, శ్రీ మహా విష్ణువులతో పాటు ఆది పరాశక్తి అమ్మవారిని ఆరాధించారు. అయ్యప్ప పంచలోహ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి దీపారాధన చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఇంట అయ్యప్ప పూజ

రెండు బస్సులు ఢీ

చంద్రగిరి: ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘనటలో ప్రయాణికులు స్వల్పగాయాలపాలైన ఘటన మండల పరిధిలోని భాకరాపేట కనుమ రహదారిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి నుంచి పీలేరు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు, మదనపల్లి నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సును ఘాట్‌రోడ్డులోని పెద్ద మలుపు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న 23 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నారావారిపల్లి సీహెచ్‌సీకు తరలించారు. అందులో కొందరికి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చంద్రగిరి పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు.



ఢీకొన్న ఆర్టీసీ బస్సులు

సమగ్ర కులగణనకు డిమాండ్



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

తిరుపతి అర్బన్: సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నేతృత్వంలో తిరుపతి నగరంలోని డీబీ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి ఓ వినతిపత్రాన్ని అందించారు. ఆయనతోపాటు పలువురు బీసీ సంఘం నేతలున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై గెస్ట్ లెక్చర్



ఏఐ, రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న చరణ్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. ఐడబ్ల్యూఐజెడ్ ఆండ్రాయిడ్ రోబో, రోబోటిక్స్ ఏపీ, తమిళనాడు రీజనల్ మేనేజర్ వీ.చరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈసీఈ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ అండ్ ఇండస్ట్రీ ఇంటర్ కనెక్ట్ విభాగాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ గౌరీశంకర్, శైలజ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌పై వేటు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా వివిధ పాఠశాలల్లో పని చేసిన జె.శ్రీనివాసులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ సోమవారం తెలిపారు. ఇదివరకు పనిచేసిన పాఠశాలల్లో పిల్లలను కొట్టడం, తోటి ఉపాధ్యాయులతో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు వారితో గొడవ పడడం వంటి కారణాలతో ఇదివరకే తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇతనిపై పలుమార్లు విచారణ చేశారని, విచారణ అధికారులను సైతం ఇబ్బంది పెట్టడంతో పాటు వాట్సాప్ గ్రూపులో అసభ్యకరమైన సందేశాలు పంపడం, యూట్యూబ్ చానల్‌లో అసభ్యకరంగా వీడియోలు పెడుతున్నట్లు తెలిపారు. దీనిపై సంజాయిషీ కోరగా సంబంధం లేని విషయాలను క్రోడీకరించి సమర్పించినట్లు తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు.

పంట బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: పంట బీమాకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం జేసీ శుభం బన్సల్ చేతుల మీదుగా బీమా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. వేరుశనగకు డిసెంబర్ 15 వరకు, వరి పంటకు డిసెంబర్ 31వరకు గడువు ఉందని తెలిపారు. ఈ మేరకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయ రెడ్డి, వ్యవసాయాధికారి సరళ, ఫ్యూచర్ జనరలి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మా కాలనీలో మద్యం షాపు వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న కలిచేడు గ్రామస్తులు

సైదాపురం: 'మా కాలనీలో మద్యం షాపు వద్దు' అంటూ మండలంలోని కలిచేడు ఎస్సీ కాలనీ వాసులు సోమవారం గ్రీవెన్స్‌లో నెల్లూరు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంపీపీ పీ.పెంచలమ్మ, సర్పంచ్ ఎస్.సురేష్ మాట్లాడుతూ మద్యం షాపు గ్రామానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేస్తుండడంతో అటువైపు వచ్చే విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు.

సరిహద్దు గ్రామాలు గజగజ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల అటవీ సరిహద్దు గ్రామాల రైతులు గజగజా వణికిపోతున్నారు. మూడు రోజుల క్రితం భాకరాపేట పంచాయతీ, దేవట్లవారిపల్లె వద్ద ఓ ఏనుగు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దీంతో ఆగ్రహించిన ఏనుగులు ఆదివారం అర్ధ అటువైపుగా వచ్చి పంట పొలాలను తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల ఘీంకారాలకు భయపడి రైతులు అటువైపు వెళ్లందుకు కూడా సాహసించలేకపోయారు. వరి, టమాట, మామిడి, కొబ్బరి చెట్లను సైతం పెకలించి వేస్తున్నట్టు వాపోయారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను స్థానిక ఎమ్మెల్యే, అధికారులు సోమవారం పరిశీలించారు. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

రామచంద్రాపురం: మండలంలోని యాగప్పరెడ్డి కండ్రిగ సమీపంలో కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ రామాంజనేయులు కథనం.. యాగప్పరెడ్డికండ్రిగ సమీపంలోని చెరువు ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్నట్టు సమాచారం అందింది. తమ సిబ్బందితో కలసి ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. అలాగే 16 ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజులు, రూ.1,480 నగదు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. దాడిలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకున్న యువకుడు అనంతపురం వాసి

రేణిగుంట: ఆర్టీసీ బస్సులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు అనంతపురం వాసిగా రేణిగుంట అర్బన్ పోలీసులు గుర్తించారు. గత సోమవారం తెల్లవారుజామున తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని ఏర్పేడు మండలం, మేర్లపాక స్టేజీ వద్ద బస్సు ఎక్కి బస్సులోనే అనంతపురం జిల్లా, బుక్కరాయసముద్రం మండలం, పొడరాళ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(26) ఉరేసుకున్నాడు. మృతుడి ఫొటోలు ప్రసార మాధ్యమాల్లో రావడంతో బుక్కరాయసముద్రానికి చెందిన ఓ చర్చి పాస్టర్ తమ ప్రాంతవాసిగా గుర్తించి అతని తల్లిదండ్రులు రామకృష్ణ, తిప్పమ్మకు సమాచారం అందించాడు. వారు మంగళవారం రేణిగుంట పోలీసులను ఆశ్రయించారు. అనంతరం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాల వద్ద వారికి శ్రీనివాసులు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు శ్రీనివాస్ డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి మద్యం అలవాటు పడి చిన్నచిన్న పనులు చేసుకుంటూ జల్సాగా తిరిగేవాడని తెలుస్తోంది. ఇంటి నుంచి 15 రోజుల కిందట పారిపోయి వచ్చేసి, ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ప్రయత్నాలు చేసి, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

త్వరలో ఒప్పంద అధ్యాపకుల నోటిఫికేషన్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో త్వరలో ఒప్పంద అధ్యాపకుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు వర్సిటీ అధికారులు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ప్రస్తుతం వర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు చరమగీతం పాడేందుకే గత రెండు నెలలుగా వారి సర్వీసును పొడిగించకుండా, వేతనాలను చెల్లించకుండా మభ్యపెడుతూ అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారు.

తమ అనుచర వర్గానికి ప్రాధాన్యం

వర్సిటీలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న సుమారు 260మంది తాత్కాలిక అధ్యాపకులు రోడ్డున పడేసి తమ అనుచరవర్గానికి పోస్టులను కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే డిసెంబర్ 15వ తేదీలోపు ఈసీ సమావేశం నిర్వహించి ఒప్పంద అధ్యాపకుల నియామకం కోసం ఆమోదం పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈసీ అనుమతిని పొందిన వెంటనే సుమారు 300 పోస్టులకు నూతన నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సర్వ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరం చేసినట్టు సమాచారం.

పోలీసుల వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చంద్రగిరి(తిరుచానూరు): భూ వివాదంలో తనను తిరుచానూరు పోలీసులు తీవ్రంగా వేధిస్తున్నారని ఓ వృద్ధురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు వృద్ధురాలిని స్టేషన్‌కు పిలిపించి ప్రత్యర్థుల చేత దాడి చేయించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. తిరుపతి రూరల్ మండలం, బ్రాహ్మణపట్టు పంచాయతీ, పాతూరుకు చెందిన కన్నెమ్మకు ఆమె సమీప బంధువు లోకనాథంకి కొన్ని రోజులుగా భూవివాదం నడుస్తోంది. గతంలో లోకనాథంకు ఉన్న భూమిని విక్రయించుకుని సొమ్ము చేసుకున్నాడు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో కన్నెమ్మ భూమిని కాజేసేందుకు లోకనాథం, స్థానిక నాయకులతో చేతులు కలిపి పన్నాగం పన్నాడు. పోలీసుల చేత బెదిరింపులకు పాల్పడుతూ వచ్చారు. కన్నెమ్మ చేసేది లేక సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. ఎస్ఐ సాయినాథ్ చౌదరి బెదిరిస్తున్నట్టు కలెక్టర్ దృష్టి తీసుకొచ్చారు. ఆమె వినతి పత్రం ఇచ్చిన విషయాన్ని అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు గుర్తించి ఆమెను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. ఆపై స్టేషన్లోనే ఎస్ఐ సిబ్బంది సమక్షంలోనే కన్నెమ్మ, ఆమె మనుమడు చెంగారెడ్డి, మధ్యవర్తి భాస్కర్‌రెడ్డిపై ప్రత్యుర్థులు లోకనాథం, అంకమ్మ, అశోక్ భౌతికదాడులకు దిగారు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవద్దంటూ ఎస్పీ సుబ్బరాయుడు పదేపదే చెబుతున్నా కొందరు పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.